# తక్కువ నీరు – ఎక్కువ దిగుబడులు: ఆరు తడి పద్ధతిలో వరి పంట సాగు

**(Alternate Wettig & Drying -AWD)**

**ఒక సానుకూల, సమర్ధవంతమైన వరి సాగు విధానం పై రైతులకు మార్గదర్శిని**



## ఆరు తడి విధానం అంటే ఏమిటి?

వరి సాగులో నీటిని ఆదా చేసే ఒక సమర్ధవంతమైన సాగు పద్ధతి ఇది.  వరి పొలంలో నిరంతరం నీటిని వదలకుండా, కొన్ని రోజుల పాటు పంటకు నీటిని పెట్టి, ఆ తర్వాత కొన్ని రోజులు పొలాన్ని ఆరనిచ్చి, తిరిగి నీటిని పెట్టే పద్ధతి ఇది. నీటి యాజమాన్యం పరంగా ఈ చిన్న మార్పు రైతుకు, రైతు పొలానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది.

## ఆరు తడి విధానం ఎందుకు పాటించాలి?



**నీటి ఆదా:** పంట సాగులో 30% నీటి వినియోగం  తగ్గుతుంది. దీనివల్ల నీటి పంపింగ్ ఖర్చులు తగ్గుతాయి, ఇతర పంటలకు నీరు అందుబాటులో ఉంటుంది. నీటి లభ్యత తక్కువగా ఉన్న చోట్ల ఇది చాలా ముఖ్యమైన అంశం.



**లాభాలు పెరుగుతాయి:** నీటి పంపులకు అవసరమయ్యే ఇంధనం, విద్యుత్ ఖర్చుల ఆదా అవుతాయి కాబట్టి మీకు అదనపు ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయి.



**ఆరోగ్యకరమైన నేల & మొక్కలు:** ఈ పద్ధతి పాటించడం వల్ల నేల నిర్మాణ స్వభావం మెరుగుపడుతుంది. జింక్ వంటి ముఖ్యమైన పోషకాల లభ్యత పెరుగుతుంది. పంట యొక్క వేరు వ్యవస్థ బలంగా పెరిగి, పంట నేలాకూలడం తగ్గుతుంది.



**తెగుళ్ళ నియంత్రణ:** పొలంలో నీటిని నిల్వ ఉంచినప్పుడు కొన్ని రకాల పురుగులు పంటను ఆశిస్తాయి. ఆరు తడి పద్ధతి పాటించడం వల్ల, వరి పంటను ఆశించే వివిధ పురుగుల జీవిత చక్రం దెబ్బ తిని, పంటకు తెగుళ్ళ బెడద తగ్గుతుంది.





**మీథేన్ (CH4) విడుదల తగ్గుదల :** నీటి నియంత్రణ వల్ల మీథేన్ వాయువు విడుదల 30-50% తగ్గుతుంది. ఇది పర్యావరణానికి మేలు చేస్తుంది, ఎందుకంటే మీథేన్ వ్యవసాయంలో విడుదలయ్యే ప్రధానమైన గ్రీన్ హౌస్ వాయువు.



**తగ్గని దిగుబడులు:** ఆరు తడి పద్ధతిని పాటిస్తే పంట దిగిబడిలో ఎలాంటి తగ్గుదల ఉండదు. నిజానికి పంట దిగుబడులు పెరిగే అవకాశం కూడా ఉంది.

---




**ఆరు తడి విధానం ఎక్కడ అనుకూలం?**

నీటి లభ్యత నిరంతరం ఉండే భూగర్భజల ఆధారిత ప్రాంతాలలో మాత్రమే ఈ ఆరు తడి పద్ధతి పాటించవచ్చు. ఎక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలు, పూర్తిగా వర్షాధార ప్రాంతాలు, డ్రైనేజి సరిగ్గా లేకుండా ఉన్న కాలువల చివరి ప్రదేశాలు, మరియు నీటి లభ్యత అనిశ్చితి ఉన్న ప్రాంతాలలో ఈ పద్ధతి అనువైనది కాదు.

---

**ఆరు తడి విధానం ఎలా పాటించాలి? - *ప్రక్రియల వారీ మార్గదర్శి***

ఆరుతడి పద్ధతి పాటించడం చాలా సులువు. ఇక్కడ అన్నింటికన్నా ముఖ్యం – మీ పొలంలో నీటి స్థాయిని నిరంతరం పరిశీలిస్తూ ఉండటం. '**ఫీల్డ్ వాటర్ ట్యూబ్** అనే సింపుల్ పరికరం ద్వారా ఈ పని చేయవచ్చు.

**నీటి పర్యవేక్షణకు ఏం కావాలి?:**

- ఫీల్డ్ వాటర్ ట్యూబ్ - దాదాపు 30 సెం.మీ (1 అడుగు) పొడవు, 10-15 సెం.మీ. (4-6 అంగుళాలు) వ్యాసార్ధం కలిగిన ఒక పి.వి,సి. పైపు.
- పైపు కి రంధ్రాలు చేయడానికి ఒక డ్రిల్లు మెషిన్.

**కీలక ప్రక్రియలు:**

1. **ట్యూబ్ సిద్ధం చేయడం:** అడుగు భాగం నుంచి పైకి 20 సెం.మీ. (8 అంగుళాలు) వరకు, ఒక్కొక్కటి 2 సెం.మీ దూరం ఉండేలా పైపుకు రంధ్రాలు చేయాలి. రంధ్రం వ్యాసార్ధం 5 మి.మీ. ఉండాలి.

2. **పొలంలో ట్యూబ్ ఏర్పాటు:** పొలంలో వరి నాటిన ఒకటి, రెండు వారాల తరువాత పొలంలో ఎంపిక చేసుకున్న నిర్దిష్ట స్థలంలో ట్యూబ్ ఏర్పాటు చేయాలి; నేలలో 10 సెం.మీ. (4 అంగుళాలు) మేర దింపి, మిగతా భాగం నేలపైన ఉండేటట్లు ట్యూబ్ పెట్టాలి. ట్యూబ్ లోపల మట్టి స్థాయి కూడా పొలంలో మట్టి స్థాయిలోనే ఉండేట్టు చూసుకోవాలి.
3. **సాగు నీరు అందించుట:** పొలంలో 5 సెం.మీ. (2 అంగుళాల) మేర ఎత్తు ఉండేలా నీరు నింపాలి.
4. **నీటి మట్టాన్ని గమనించడం:** పొలంలో నీరు సహజంగా ఇంకిపోయేవరకు చూడాలి. ట్యూబ్ లోపల ఉండే నీటి మట్టం స్థాయి, నేల దిగువన మట్టిలో ఉండే నీటి స్థాయికి సమానంగా భావించాలి.
5. **మరల నీరు అందించే సమయం:** పొలంలో భూమట్టంతో పోలిస్తే, ట్యూబ్ లోపల నీటి మట్టం 15 సెం.మీ (6 అంగుళాలు) కన్నా దిగువకు పడిపోయినప్పుడు, పొలానికి మళ్ళీ నీరు పెట్టాల్సిన సమయమని గుర్తుంచుకోవాలి. అప్పుడు పొలంలో మళ్ళీ 5 సెం.మీ. మందం మేర నీరు నింపాలి.
6. **ప్రక్రియ కొనసాగించుట:** పంట ఎదిగే కాలం అంతా ఇలా పొలాన్ని నీరు బెట్టి, ఆరనిచ్చి, మళ్ళీ నీరు పెడుతూ ఉండాలి.




Prepare the Tube | Install the Tube | Irrigate | Wait and Watch

---

**"సురక్షితమైన ఆరుతడి విధానం": పంటకు నీరు అందిచించాల్సిన కీలక దశలు**

పంట దిగుబడులలో ఎలాంటి నష్టం రాకుండా చూసుకునేందుకు గాను కొన్ని కీలక పంట దశలలో ఈ ఆరు తడి పద్ధతిని తాత్కాలికంగా ఆపాలి. ఆ దశలలో పొలంలో తప్పనిసరిగా నీరు ఉండేలా చూసుకోవాలి.



***పూతకు ముందు ఒక వారం, పూత తరువాత ఒక వారం – మీ వరి పొలం అంతటా 5 సెం.మీ. మేరకు నీరు నింపి ఉంచాలి.*** వరి పంటలో మొక్కల ఎదుగుదలలో ఇది చాలా కీలక దశ. ఈ దశలో మొక్కలకు సరిపడా నీరు అందించడం చాలా అవసరం. అలా చేస్తేనే గింజ ఉత్పత్తి బాగుంటుంది. ఈ దశ ముగిసిన తరువాత, పొలంలో మళ్ళీ ఆరు తడి పద్ధతిని కొనసాగించవచ్చు.



**గుర్తుంచుకోవాల్సిన అంశాలు**

- **కలుపు యాజమాన్యం:** పొలం ఆరి ఉన్నప్పుడు కొన్నిసార్లు కలుపు బాగా పెరుగుతుంది.అలాంటి సమయంలో సమర్ధవంతమైన కలుపు యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలి.
- **ఎరువుల యాజమాన్యం:** పొలంలో నీరు పెట్టేముందు, పొడి నేలలో నత్రజని ఎరువు వేస్తే అది సమర్ధవంతమైన ప్రభావం చూపుతుంది.
- **అన్ని నేలలకు ఆరు తడి కుదరదు:** మృదువైన నేలలు, బంకమట్టి నేలలలో ఆరు తడి పద్ధతి పాటించవచ్చు. త్వరగా ఎండిపోయే ఇసుక నేలలకు ఈ పద్ధతి అనువైనది కాదు.
- **పొలం సమతలంగా ఉండాలి:** పొలం సమతలంగా ఉంటే నీరు పొలం అంతటా సమానంగా విస్తరిస్తుంది. అందువల్ల మధ్యమధ్యలో ఎండిపోకుండా ఉంటుంది.